


# ఔరా! తాతా!!

- ఆర్.ఎస్.హైమవతి

**"అమ్మమ్మా! అమ్మమ్మా!!" అంటూ ఒగుర్చుకుంటూ పరిగెట్టుకుంటూ వచ్చి ఆయాసపడుతోంది మనవరాలు సుధ.**

"ఏమిటమ్మా? ఏమయింది? తాతగారితో కబుర్లు, కథలు అయిపోయాయా? పరిగెట్టుకుంటూ అలా ఆయాసపడుతున్నావు. తాతకేమైనా అయిందా?" అంటూ ఖంగారుపడింది అమ్మమ్మ పార్వతమ్మ.

"తాతకేమీ అవలేదు. కాని, కాని..."

"అమ్మయ్య! తాతకేమీ అవలేదు కదా! మరేమిటే? ఆ గాభరా! ఆయాసమూను!" అంది పార్వతమ్మ.

"తాతయ్య నాకు కథలు కొంతసేపు చెప్పాక" ఇక ఇవాల్టికి చాలు. రేపు మళ్ళీ చెప్తా! వెళ్ళు. పడుకో!" అన్నారు. "సరే"అని నేను బైటకి వచ్చేశాను. వచ్చి పడుకుంటే నిద్ర రాలేదు. "రేపు ఏం కథ చెప్తావు? తాతయ్యా!" అని అడుగుదామని తిరిగి గదిలోకెళ్ళాను.

"ఊ! వెళ్తే?" ఆత్రంగా అడిగింది పార్వతమ్మ.

"వెళ్ళేసరికే తాతయ్య ఏదో ఫొటోని ముద్దుపెట్టుకుంటున్నాడు. తరవాత గుండెల మీద పెట్టుకున్నాడు. నేను పరుగున వెళ్ళి లాక్కుని చూశాను. ఒక అందమైన అమ్మాయి ఫొటో! తాతయ్య నా చేతుల్లోంచి బలంగా లాగేసుకుని తలగడ కింద దాచేశాడు. లేకపోతే నీకు తెచ్చి చూపిద్దామనుకున్నా! ఎవరో అమ్మాయి ఫొటో అమ్మమ్మా! అంత ముసలాడికి ఇదేం బుద్ధి చెప్పు?" ఆరిందాలా అడిగింది ఎనిమిదేళ్ళ సుధ.

> తాతయ్య ఏదో ఫొటోని ముద్దుపెట్టుకుంటున్నాడు. తరవాత గుండెల మీద పెట్టుకున్నాడు. నేను పరుగున వెళ్ళి చూశాను. ఒక అందమైన అమ్మాయి ఫొటో!

"మీ తాతయ్యకి అంత సీను లేదు లేవే! నువ్వు పడుకో! మీ తాతయ్య పని నేను పడతాలే!" అంది పార్వతమ్మ తేలిగ్గా.

సుధ పడుకుందన్నమాటే గాని నిద్ర రావడం లేదు. ఒక రోజు నాన్న రోడ్లోపోయే అమ్మాయిని చూస్తే అమ్మ నాన్నని తిట్టింది. మరో రోజు సినిమా తార ఎవరో బాగుందని మెచ్చుకున్నాడని అమ్మ నాన్నని తిట్టింది. ఆరోజే కాదు, మరో మూడు రోజుల వరకూ అమ్మనాన్నతో మాట్లాడలేదు. మరీ అమ్మమ్మ ఏమిటి? ఎవరో అందమైన అమ్మాయి ఫొటోని ముద్దుపెట్టుకుని గుండెల మీద పెట్టుకుని పడుకున్నాడని చెప్తే ఏమీ అవడం లేదు? తాతయ్యకీ అమ్మమ్మకి పెద్ద యుద్ధమే జరుగుతుందనుకుంటే లెక్కచెయ్యకుండా కొట్టిపారేసింది. ఏమిటో? ఈ పెద్దాళ్ళు? అనుకుంటూ పడుకుంది సుధ.

❊ ❊ ❊

శంకరం, పార్వతమ్మలది ఉమ్మడి కుటుంబం. వాళ్ళకి ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. కూతురు, అల్లుడు ఢిల్లీలో వుంటారు. శంకరంగారు సెంట్రల్ గవర్నమెంటు ఉద్యోగం చేసి రిటైరయ్యాక హైదరాబాదులో త్రీబెడ్ రూమ్ ఫ్లాటు తీసుకున్నారు. కొడుకులు, కోడళ్ళు రెండు బెడ్‌రూమ్‌ల్లో పడుకుంటే శంకరం పార్వతమ్మ ఒక బెడ్‌రూమ్‌లో పడుకుంటారు. కూతురు అల్లుడు వస్తే వీళ్ల హాల్లోకి మారతారు.

ఈసారి శలవులేదని అల్లుడు రాకుండా సమ్మర్ సెలవలకి అమ్మాయిని, పిల్లల్ని మాత్రం పంపాడు. అంచేత శంకరం, మనవడు గదిలో పడుకుంటే పార్వతమ్మ, కూతురు, మనవరాలు హాలులో పడుకుంటున్నారు.

రోజూ రాత్రిపూట శంకరం, పార్వతమ్మ, మనవలు ఏడుగంటలకల్లా భోజనాలు చేసేస్తారు. కొడుకులిద్దరి గదుల్లో చెరో టి.వి, హాల్లో ఓ టి.వి. వుండడంతో పార్వతమ్మ హాల్లో టి.వి. చూస్తుంటే మనవలంతా (కొడుకుల పిల్లలు మొత్తం నలుగురు, కూతురి కొడుకు) గదుల్లో టి.వి. ప్రోగ్రాములు చూస్తుంటారు. సుధకి టి.వి. ప్రోగ్రాములకన్నా కథలంటేనే ఇష్టం. అందుకే తాత దగ్గిర కథలు వింటూ, అమ్మమ్మతో కబుర్లుచెప్తూ పడుకొంటుంది.

సుధ తన భర్త గురించి చెప్పిన మాటలు కొడుకులు, కోడళ్ళు ఎవరూ వినలేదుకదా! అని పార్వతమ్మ చుట్టూ చూసింది. డైనింగ్ టేబుల్ దగ్గిర పెద్దవాళ్ళు ఐదుగురూ కబుర్లు చెప్పుకుంటూ జోకులేసుకుంటూ భోజనాలు చేస్తున్నారు. వాళ్ళెవరూ దీని మాటలు వినే మూడ్‌లో లేరు. ఇకపోతే మనవలు ముగ్గురు ఓ గదిలో 'జెటిక్స్'చూస్తూంటే మరో గదిలో ఇద్దరు కార్టూన్ నెట్‌వర్క్ చూస్తున్నారు. వాళ్ళెవరికీ దీని మాటలు వినిపించవు. పైగా ఆయాసపడుతూ మెల్లిగానే చెప్పిందిగా! అని సరిపెట్టుకుంది. లేకపోతే నలుగురూ వింటే ఆయన గురించి ఏమనుకుంటారు? దానికి లేవగానే ముందు చెప్పాలి. ఎవరికీ మళ్ళీ ఈ విషయం చెప్పొద్దని. తను తన భర్తని ఏమైనా అంటుంది. రోజూ ఏదో విషయంమీద దెబ్బలాటలు కూడా ఇద్దరికీ జరుగుతూంటాయి. కాని, ఆయనని ఎవరైనా పల్లెత్తు మాట అంటే తను సహించలేదు. వాళ్ళతో వాదించి వాళ్ళకి వివరణ ఇచ్చి, వాళ్ళు సమాధానపడి తన భర్త మంచితనాన్ని ఒప్పుకునే వరకూ ఊరుకోదు.

❊ ❊ ❊

"అమ్మలూ! సుధా! రాత్రి నువ్వు చూసిన తాతయ్య విషయం ఎవరితోనూ చెప్పకేం?" అంది పార్వతమ్మ సుధ లేస్తూండగానే మెల్లిగా చెవిలో. సరే అన్నట్లుగా తలాడించింది సుధ.

